


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## మగాడు

ఫోన్ శబ్దానికి గాఢనిద్రలో ఉన్న చంద్రకాంత్ పక్కమీద తడిమి ఫోన్ ఆన్ చేసి చెప్పాడు.

"హలో."

"లేచారా?" అవతలనించి సుజాత కంఠం వినిపించింది.

"ఇంత అర్ధరాత్రి ఎందుకు ఫోన్ చేసావ్?" విసుగ్గా అడిగాడు.

"అర్ధరాత్రా? టైం ఆరున్నర. ఇవాళ ఎవరో ఫారిన్ వాళ్ళతో మీటింగ్ అన్నారు? కొరియా వాళ్ళో, జపాన్ వాళ్ళో?"

చంద్రకాంత్ నిద్రమత్తు ఎగిరిపోయింది. ఎనిమిదిన్నరకల్లా ఆఫీస్‌లో ఉండాలి.

"లేచాను. నువ్వు ఫోన్ పెట్టెయ్. రెడీ అవాలి" చెప్పాడు.

ఒక్క క్షణం ఆగి చిత్ర నంబర్ డయల్ చేసాడు. రెండు రింగ్స్‌కే ఎత్తింది.

"బుజ్జి కన్నలూ. లేచారా? కాఫీ తాగారా?" గోముగా అడిగింది.

సుజాత ఇంత ప్రేమగా చస్తే మాట్లాడదు అనుకున్నాడు.

"ఇవాళ ఆఫీస్‌లో మీటింగ్స్ ఉన్నాయి. ఈవినింగ్ మాట్లాడుకుందాం. బై" చెప్పాడు.

"బై బంగారం. సీయూ" చిత్ర లైన్ కట్ చేసింది. చంద్రకాంత్ బ్రష్ చేసుకుని కాఫీ కలుపుకుంటుండగా మళ్ళీ సుజాత నించి ఫోన్.

"గీజర్ వేసారా?"

"అయ్యో లేదు."

"వెంటనే వెళ్ళి ఆన్ చేయండి. చన్నీళ్ళు స్నానం మీ వల్ల కాదు. నిన్నటి బట్టలే వేసుకుంటారేమో. పిల్లల రూంలో మంచం మీద మీ డ్రెస్‌లు పెట్టాను. ఈ రోజు స్కై బ్లూ కలర్ షర్ట్ వేసుకోండి."

"సరే" వెళ్ళి గీజర్ వేసి వచ్చాడు.

సుజాతని రైలు ఎక్కించి వచ్చాక అర్ధరాత్రి దాకా చిత్రతో ఫోన్‌లో మాట్లాడాడు. 'ఇక్కడికి రావచ్చుగా' అని ప్రేమగా అడిగింది కాని రైలు మధ్యలో ఆగిపోయి సుజాత వెనక్కి వస్తుందేమో అన్న భయంతో వెళ్ళలేదు.

'ఇవాళ వెళ్ళాలి' అనుకున్నాడు. ఆ ఆలోచన అతనికి ఉత్సాహాన్నిచ్చింది. ఈల వేసుకుంటూ స్నానానికి వెళ్ళాడు.

స్నానమయ్యాక పిల్లల రూములోకి వెళ్తే తన దుస్తులు ఆరు దొంతరలుగా కనిపించాయి. అంటే ఏడో రోజుకి సుజాత వచ్చేస్తుందన్నమాట. ఆమె చెప్పినట్లే స్కై బ్లూ షర్ట్ పైన కనబడే సెట్‌ని తీసుకున్నాడు. లో దుస్తులతో సహా పెట్టింది.

రెడీ అవుతూండగా మళ్ళీ సుజాత నించి ఫోన్.

"ఏమిటి?" విసుగ్గా అడిగాడు.

"అదేదో ప్రాజెక్ట్ రిపోర్ట్ ఫైల్, హార్డ్ డిస్క్ తీసుకెళ్ళాలి గుర్తు చెయ్ అన్నారు. తీసుకున్నారా?" అడిగింది.

"రక్షించావు తల్లీ మర్చిపోయాను. ఇంతకీ మీ చెల్లికి పుట్టిన పిల్ల ఎలా ఉంది?" ఆ కృతజ్ఞతతో కుశలం అడిగాడు.

"ఏం భాషండీ బాబూ.. పిల్లా? బాగుంది. బారసాల అవగానే వచ్చేస్తాను. జాగ్రత్తగా ఉండండి" సుజాత ఫోన్ కట్ చేసింది.

ఆఫీస్‌కి వెళ్ళేసరికి అప్పటికే వచ్చి కంప్యూటర్ ఆన్ చేసి పనిచేసుకుంటున్న చిత్ర కనిపించింది. ముభావంగా తన క్యూబికల్‌లోకి వెళ్ళి కూర్చున్నాడు. ఆఫీస్‌లో వాళ్ళిద్దరూ పూర్తి అపరిచితుల్లా ప్రవర్తిస్తారు.

సాయంత్రం ఆరుదాకా ఊపిరి సలపనంత పని. ఆరున్నరకి బయటకి వచ్చి చూస్తే కారు పార్కింగ్ లాట్‌లో నాలుగు కార్లే ఉన్నాయి. చిత్ర ఆరింటికే ఇంటికి వెళ్ళిపోయింది.

సరాసరి చిత్ర అపార్ట్‌మెంట్‌కి వెళ్ళిపోయాడు. షార్ట్స్‌లో ఉన్న చిత్ర అతన్ని గాఢంగా కౌగలించుకుని చెప్పింది.

"ఎన్నాళ్ళకి నా ఇంటికి వచ్చావు బుజ్జిబాబూ."

చంద్రకాంత్ ఆమెని చుంబించి బెడ్‌రూంలోకి తీసుకెళ్ళాడు. మంచం మీద చిత్ర ఉదయం ఆఫీస్‌కి వేసుకొచ్చిన డ్రెస్ వుంది. దాన్ని కిందకి తన్నేసాడు.

అరగంట తర్వాత డ్రాయింగ్ రూములో సోఫాలో కూర్చున్న చంద్రకాంత్ ఒళ్ళో పడుకున్న చిత్ర అతని చేతి వేళ్ళతో ఆడుకుంటోంది.

"ఆకలిగా ఉంది" చెప్పాడు.

"అయ్యో నా బుజ్జికొండా. నేను ఆరింటికి ఇంటికి రాగానే తినేస్తాను కదా. ఇంట్లో ఏమీలేవు. ఒక్కదాన్నేగా ఎక్కువ ఉంచుకోను. బిస్కెట్ తింటావా?" అతని గడ్డం పట్టుకుని అడిగింది.

"వద్దు. ఇక వెళ్తాను."

"అప్పుడేనా? ఇంకాసేపు ఉండచ్చుగా?"

"రేపటికి కొంచెం ప్రిపేర్ అవాలి. పని ఉంది. నాకూ వెళ్ళాలని లేదు" వంగి ఆమెని చుంబిస్తూ చెప్పాడు.

మరో అరగంట తర్వాత చంద్రకాంత్ అయిష్టంగా ఇంటిదారి పట్టాడు.

'సుజాత పుట్టింటికి వెళ్ళిన టైంలోనే ఈ కొరియావాళ్ళు వచ్చి కూర్చున్నారు ' విసుక్కున్నాడు.

ఇంట్లో అడుగుపెట్టగనే సుజాత నించి ఫోన్.

"రోజు ఎలా గడిచింది? డిన్నర్ బాగుందా?"

"లేదు. ఆకలిగా ఉంది" చెప్పాడు.

"అదేం? కొరియావాళ్ళతో స్టార్ హోటల్లో డిన్నర్. రాత్రికి లేట్‌గా వస్తానన్నారు?"

"అంటే, వాళ్ళు చాలా తక్కువ తిన్నారు. నేను కూడా తక్కువే తిన్నా" అబద్ధం చెప్పాడు.

"అయ్యో" సుజాత ఫోన్ పెట్టేసింది.

ఇరవై నిమిషాల తర్వాత డోర్ బెల్ మోగింది. చూస్తే స్విగ్గీ డెలివరీ బాయ్. చేతిలో ఓ పేకెట్ పెట్టి వెళ్ళాడు.

మళ్ళీ సుజాత నించి ఫోన్.

"మినర్వానించి బిర్యానీ ఆర్డర్ చేసాను. ఈ రాత్రి ఏదో ఆఫీస్ పని ఉందన్నారు. ఆకలితో ఏం చేస్తారు? శుభ్రంగా తిని చేసుకోండి. రేపు ఎన్నింటికి వెళ్ళాలి?"

"ఇవాళ్టిలానే" చెప్పాడు.

"సరే ఐతే రేపు మాట్లాడుకుందాం. తిని పనిచేసుకోండి. గుడ్‌నైట్."

చంద్రకాంత్ బిర్యానీ తిని ఆఫీస్ పనిలో పడ్డాడు.

మర్నాడు భార్య ఫోన్ కాల్‌తో  నిద్రలేచిన చంద్రకాంత్, చిత్రకి గుడ్‌మార్నింగ్ చెప్పి కాఫీ కలుపుకోడానికి వెళ్ళాడు. స్టవ్ వెలగలేదు. సుజాతకి ఫోన్ చేసాడు.

"ఏం సమస్య వచ్చింది?" అడిగింది.

"సమస్య లేకపోతే చేయకూడదా?" ఉడుక్కున్నాడు.

"అవునా? ఉభయకుశలోపరికి చేసారా? ఇక్కడ మేం క్షేమం. అక్కడ మీరు కులాసా అని తలుస్తాను" నవ్వింది.

"కులాసానా? ఈ స్టవ్ వెలగడంలేదు. నువ్వు వచ్చాక మార్చిపారెయ్."

సుజాత గలగలా నవ్వింది.

"గేస్ ఐపోతే అదేం చేస్తుంది పాపం? సిలిండర్ మార్చండి."

"నాకు రాదు. ఐనా ఊరెళ్ళేప్పుడు మార్చి వెళ్ళచ్చుగా?" విసుక్కున్నాడు.

సుజాత ఫోన్ పెట్టేసింది.

"రాక్షసి" ఇప్పుడేం చేయాలి?" చంద్రకాంత్‌కి కోపం వచ్చింది.

కాలింగ్ బెల్ మోగింది. వాచ్‌మేన్.

"అమ్మగారు సిలిండర్ మార్చమన్నారండి" చెప్పి లోపలికి వచ్చి నిమిషంలో మార్చి స్టవ్ వెలిగించాడు.

"పొయ్యి మీద పాలున్నట్టున్నాయ్. చూసుకోండి సర్" చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత రొటీన్ క్రితం రోజులానే సాగింది. సాయంత్రం చిత్ర ఇంటికి వెళ్ళాడు.

"బుజ్జిబాబూ సుజ్జీకి డివోర్స్ ఎప్పుడిస్తావ్? తనకి మనగురించి ఎప్పుడు చెప్తావమ్మా?" చిత్ర గోముగా అడిగింది.

"చెప్తాను. పుట్టింటికి వెళ్ళిందిగా రానివ్వు" చంద్రకాంత్ ఆమెని ముద్దాడుతూ చెప్పాడు.

"నాకు అతనితో పడలేదు. బయటకి వచ్చేసా. ఏడాదిలో విడాకులు తీసుకున్నా. ఇలాంటి విషయాల్లో క్విక్ డెసిషన్స్ తీసుకోవాలబ్బాయ్."

"యస్. తను రాగానే చెప్పేస్తాను" చంద్రకాంత్ హామీ ఇచ్చాడు.

"వస్తున్నారా?" సుజాత అడిగింది.

"ఎక్కడికి?"

"ఎక్కడికేమిటి? బారసాలకి వస్తానన్నారు కదా? కలిసి వెనక్కి వద్దామన్నారు?"

"సారీ. కొరియా వాళ్ళు వచ్చినప్పుడు వేరే పనులు చేయలేకపోయాం. ఇప్పుడవన్నీ చేయాలి. లీవ్ దొరకలేదు" అబద్ధం చెప్పాడు.

"మీ పేరెంట్స్‌కి మీరు ఒక్కరే. నాకున్నది చెల్లి ఒక్కటే. మనవాళ్ళ ఫంక్షన్స్‌కి కూడా రాకపోతే ఎలా?" సుజాత నిష్టూరంగా అడిగింది.

"కుదరదన్నాగా?" చంద్రకాంత్ విసుగ్గా ఫోన్ పెట్టేసాడు.

మరసటి రోజు సెలవు పెట్టి చిత్రతో ఊరి చివరవున్న రిసార్ట్‌లో గడిపాడు. అతనికి యవ్వనపు తొలిరోజులు గుర్తొచ్చాయి. సుజాత నించి రెండు మూడుసార్లు ఫోన్లు వచ్చినా పట్టించుకోలేదు.

ఆ రోజు పొద్దున్నే బరువుగా తోచి కళ్ళు విప్పి చూసాడు. చిన్నాడు మీద పడుకుని గడ్డం మీద వేళ్ళతో రాస్తున్నాడు.

'వచ్చేసారా?' వాడి చేతిని ముద్దుపెట్టుకున్నాడు. నిద్రలో ఉన్నవాడు సమాధానం చెప్పలేదు. వాడికి నిద్రలో తండ్రి మొహం తడమడం, చెవి పట్టుకోవడం అలవాటు.

వాడికి నిద్రాభంగం కలగకూడదని కదలకుండా పడుకుని సైడ్ టేబుల్ మీదున్న ఫోన్ అందుకున్నాడు.

'ఓయ్ సి.కె ఇవాళేనా మీ ఆవిడ వచ్చేది? మన హేపీ డేస్ అయిపోయాయబ్బాయ్ ' – చిత్ర మెసేజ్ కనిపించింది.

వంటింట్లోంచి సువాసనలు వస్తున్నాయి. పెద్దకొడుకు గొంతు తగ్గించి తల్లినేదో అడుగుతున్నాడు. తను నిద్రపోతున్నప్పుడు నిద్రాభంగం అవుతుందని సుజాత పిల్లల్ని పెద్దగా మాట్లాడనివ్వదు. తనూ తగ్గు స్వరంతో మాట్లాడుతుంది.

అతనికి ఎందుకో హాయిగా అనిపించింది. ఎంత నిశ్చింత జీవితం తనది. ఉద్యోగం తప్ప ఒక్క బాధ్యత కూడా లేదు. సుజాత సమర్థురాలు. ఇంటిని శుభ్రంగా ఉంచుతుంది. అన్నీ చూసుకుంటుంది. తెలివిగా ఇన్వెస్ట్ చేస్తుంది. రుచిగా వంట చేస్తుంది. పిల్లల్ని చక్కగా పెంచుతుంది.

"చాలా పెండింగ్ పని ఉందన్నారు? లేవండి" సుజాత బెడ్‌రూంలోకి వచ్చి చెప్పింది.

"కాస్త సరసంగా వచ్చి ముద్దు పెట్టుకుని లేపచ్చుగా?" అడిగాడు.

పెద్దగా నవ్వింది. చిన్నాడు కదిలి తండ్రి చెవి పట్టుకుని నులుముతూ పడుకున్నాడు.

"ష్! లేస్తాడు" చెప్పాడు.

"అబ్బో పిల్లల మీద ఎంత ప్రేమో! ఈ పదిరోజుల్లో ఒక్కసారైనా పిల్లలు ఎలా ఉన్నారని ఫోన్ చేసారా? వాళ్ళతో మాట్లాడారా? అసలు గేస్ ఐపోయినప్పుడు తప్ప మీ అంతట మీరు ఫోన్ చేసారా? బారసాల అయ్యాక 'పాపకి ఏం పేరు పెట్టారని'అడిగారా? ఇంత అయోమయంగా ఉంటే ఎలాగండీ? అంత బాధ్యతాయుతమైన ఉద్యోగం ఎలా చేస్తున్నారో ఏమో? ఐన్‌స్టీన్ తన ఇంటి అడ్రస్ మర్చిపోయాడంటే నవ్వుకున్నా కానీ మీరు కూడా అంతే."

సుజాత గలగల మాట్లాడుతూ కిటికీ కర్టెన్స్ పక్కకి జరిపింది. లేత ఎండ లోపలికి పడుతోంది.

చిన్నాడు లేచి పక్కకి జారి తండ్రిని వాటేసుకుని చిన్న చెల్లెలి గురించి చెప్తున్నాడు. పెద్దాడు వచ్చి రెండో పక్కన చేరాడు.

పది నిమిషాలు వాళ్ళ కబుర్లు విని లేచి మొహం కడుక్కుని బయటకు వచ్చాడు. ఇల్లు అద్దంగా ఉంది, మెరిసిపోతోంది.

"ఇల్లు దుమ్ము పట్టిపోయింది. పనిమనిషి రావడానికి మీరు రోజూ లేట్‌గా వచ్చారట. పాపం ఆఫీస్‌లో అంత పని ఉందేమో. మరి మా చెల్లికి మాత్రం ఎవరున్నారు నేను తప్ప. ఇంకొకరి కోసమైతే ఇన్నిరోజులు వెళ్ళేదాన్నేకాదు. మీరు భలే మంచివాళ్ళు. ఇబ్బంది పడ్డా నన్ను రమ్మనలేదు."

సుజాత భర్తకి బ్రేక్‌ఫాస్ట్ వడ్డిస్తూ మెచ్చుకోలుగా చెప్పింది.

సాయంత్రం లేట్ అవుతుంది. నేను వచ్చేలోగా పిల్లల్ని నిద్రపుచ్చు . పదిరోజుల బాకీ . చెప్పాడు.

సుజాత నవ్వింది

ఆ సాయంత్రం చిత్ర ఇంటికి వెళ్ళాడు. టి.వి చూస్తూ బర్గర్ తింటోంది. దాన్ని టీపాయ్ మీద పెట్టి అతన్ని కౌగలించుకుని చెప్పింది.

"సర్‌ప్రైజ్. నువ్వు వస్తావనుకోలేదు. ఇవాళ చెప్పేస్తావా విడాకుల గురించి?"

అతను కూడా ఆమెని గాఢంగా కౌగలించుకుని చెప్పాడు.

"సుజ్జీ మీద నాకేం ప్రేమలేదు కాని పిల్లల్ని వదిలి ఉండడం కష్టం అనుకుంటా. మనం ఇలాగే ఉండచ్చుగా హనీ? నువ్వు చాలా ఫార్వర్డ్. పెళ్ళి మీద సదభిప్రాయంలేదు ఎటూ. నేను కేవలం పిల్లల కోసమే ఆ ఇంటికి వెళ్తా అంతే. నా సాయంత్రాలు నీతోనే గడుపుతాను. అప్పుడప్పుడూ వీకెండ్స్‌కి వెకేషన్‌కి వెళ్దాం. ఫైనాన్షియల్లీ నువ్వు నామీద డిపెండెంట్ కాదు కాబట్టి నీ లైఫ్ నువ్వు స్వేచ్ఛగా గడపచ్చు.తేడా అల్లా రాత్రుళ్ళు ఇక్కడ పడ్కోను. అంతేగా? ఏం చేయను చెప్పు. నా పెళ్ళికి ముందు నాకు కనపడితే ఎంత బాగుండేదో. సుజాతని చిటికెన వేలితో కూడా తాకను. నా మనసంతా నువ్వే" ఆమెని పదే పదే చుంబిస్తూ చంద్రకాంత్ చెప్తూనే ఉన్నాడు.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments